క్లుప్తంగా

రక్తదానం ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానమని ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు బి.రామకృష్ణారావు అన్నారు. స్థానిక సర్వజన ఆస్పత్రి రక్తనిధి కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానంపై అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. మనిషి మాత్రమే రక్తం దానం చేసి ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడగలడన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, సూర్యప్రభ, తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటితో అవస్థలు



ప్రధాన రహదారిపై నిలిచి ఉన్న మురుగునీరు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని నెల్లిమర్ల-రణస్థలం ప్రధాన రహదారిలో స్థానిక దేవుని నెలివాడ గ్రామం వద్ద మురుగు నీటితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలను కలిపే రహదారి కావడంతో నిత్యం ఈ రహదారిలో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. గ్రామంలో కాలువలు లేకపోవడంతో ఇళ్లల్లో వాడుకు నీరంతా ప్రధాన రహదారిపై చేరి నిలిచిపోతోంది. దీంతో స్థానికులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంత నిర్వాహకులపై చర్యలు తీసుకోండి



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న గోసంరక్షణ సమాఖ్య సభ్యులు

జామి: నిబంధనలు పాటించకుండా అలమండలో పశువుల సంత నిర్వహిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గోసంరక్షణ సమాఖ్య అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని గాంధీ విగ్రహానికి గోసంరక్షణ సమాఖ్య సభ్యులతో కలిసి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లొట్లపల్లి పంచాయతీలో ప్రతీ సోమవారం ఎటువంటి అనుమతులు, సదుపాయాలు లేకపోయినా అధికారులు అండదండలతో నిర్వాహకులు పశువుల సంత నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. గోసమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.వి.ఆర్.సత్యనారాయణరావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రాజకుమారి, పైడితల్లి, సీలాపు దేవి, ప్రశాంత్‌కుమార్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పంచామృతాభిషేకాలు



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి అర్చకులు ఆరవెల్లి రవిశర్మ ఆధ్వర్యంలో ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు. ఆదివారం అమ్మ వారికి ప్రత్యేకత కావడంతో తెల్లవారు జామున 5గంటల నుంచే అర్చకులు అమ్మవారికి అభిషేకాలు చేసి, అనంతరం అమ్మవారిని అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో అమ్మవారి దేవస్థానంలో దాతల సహకారంతో భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యమా?

- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం
- తాగునీరు, విద్యుత్ సమస్యలపై అధికారులను నిలదీసిన సభ్యులు



బొండపల్లి: సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ లోవోల్టేజ్, తాగునీరు, తదితర సమస్యల పరిష్కారంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారని మండల పరిషత్ సభ్యులు నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించి న మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. మండలంలో పలుశాఖల అధికారుల తీరుపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తీవ్రఅసహనం వ్యక్తం చేశారు. బి.రాజేరు, ముద్దూరు, నెలివాడ, కనిమెరక గ్రామాల్లో విద్యుత్ లోవోల్టేజ్ సమస్య ఎక్కువగా ఉందని, అలాగే అనధికారికంగా వేళాపాల లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారని, సమస్యను విద్యుత్ శాఖ ఏఈఈ శంకరరావుకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఈదుబిల్లి కృష్ణ,మునకాల పైడిపునాయుడు, తాళ్లపూడి కీర్తి తెలియజేశారు. మరువాడ సీపీడబ్ల్యూ పథకం నుంచి సక్రమంగా తాగునీరు సరఫరా కావడంలేదని, సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సునీల్‌ను ఎం.కొత్తవలస సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు ప్రశ్నించారు. అలాగే జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా పైపులైన్లు వేసేందుకు గ్రామాల్లో సీసీ రోడ్లను తవ్వేశారని, వాటిని పూడ్చే భారం పంచాయతీలపై పడుతోందని, కేంద్ర ప్రభుత్వమే ప్రత్యేకంగా నిధులు విడుదల చేసి మరమ్మతులు చేయించేలా చూడాలని పలువురు సర్పంచ్‌లు అధికారులను కోరారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి ఏయే గ్రామాలకు ఐసీఆర్‌పీలు ఉన్నారు..?, మండల యాంకర్‌లు ఎంత మంది ఉన్నారు, వీరి పర్యవేక్షణ ఎవరి పరిధిలో ఉంటుంది, మండలంలో ఎన్ని గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం సాగుచేస్తున్నారన్న వివరాలు చెప్పాలని ఏఓను ఎం.కొత్తవలస సర్పంచ్ అడిగారు. ఏఓ మల్లికార్జునరావు స్పందిస్తూ ప్రకృతి వ్యవసాయం డీపీఎం పరిధిలో ఉంటుందని, తన వద్ద వివరాలు లేవని సమాధానం చెప్పారు. సమావేశానికి 21 శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాల్సి ఉండగా ఏడు శాఖలకు చెందిన అధికారులే హాజరయ్యారు. గైర్హాజరైన అధికారులకు నోటీసులు పంపించాలని ఎంపీడీఓకు ఎంపీపీ ఆదేశాలు జారీ చేశారు. జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, ఎంపీడీఓ ఎస్.హరిహరరావు, తహసీల్దార్ హనుమంతు రావు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



బొండపల్లి: అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

సమన్వయంతో పనిచేయండి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ సత్యవంతుడు



వేపాడ: మాట్లాడుతున్న ఎంపీపీ సత్యవంతుడు

వేపాడ: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టిసారించాలని ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు సూచించారు.స్థానిక మండల పరిషత్ కార్యా లయంలో మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలు సభకు చదివి వినిపించారు.ఏఓ యశ్వంత రావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలు రైతులకు అందించామని, రైతుభరోసా కేంద్రాల్లో ఎరువులు సిద్ధంగా ఉంచామని చెప్పారు. బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి రమాదేవి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు బారినపడకుండా ఉండేందుకు ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. వర్షాకాలం కావడంతో పారిశుద్ధ్య పనులు తరచూ చేయించాలని, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సర్పంచ్‌లను కోరారు. జూలై 7 నుంచి14 వరకు పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి సింహాచలం నాయుడు తెలిపారు. మండలంలో 24 వేల గొర్రెలు,మేకలు ఉన్నా యని, వీటిలో 16 వేల జీవాలకు వ్యాక్సిన్ వేయిస్తున్నామని చెప్పారు. రేషన్ పంపిణీ ఈనెల ఎండీయూ వాహనాల ద్వారానే చేస్తామని సీఎస్‌డీటీ తెలిపారు. గతంలో గృహాలు మంజూరైన వారంతా జూలై 15లోగా పనులు ప్రారంభించి, డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని, లేకుంటే ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే ఇల్లు రద్దు చేస్తామని గృహనిర్మాణశాఖ డీఈ శ్రీనివాసరావు తెలిపారు. గ్రామాల్లో సర్పంచ్‌లు పారిశుద్ధ్యపనులు చేయించాలని, వాటర్ ట్యాంకులను 15 రోజులకొకసారి క్లోరినేషన్ చేయించాలని ఈఓపీఆర్‌డీ ఉమ సర్పంచ్‌లను కోరారు. నీలకంఠరాజపురంలో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం నిర్మాణం పూర్తి చేయాలని డీసీసీబీ చైర్మన్, నీలకంఠరాజపురం ఎంపీటీసీ వేచలపు వెంకట చినరామునాయుడు కోరారు. బొద్దాం పీహెచ్‌సీలో ప్రధాన గేటు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలని ఎంపీపీ సత్యవంతుడు పంచాయతీరాజ్ ఏఈకి సూచించారు. అరిగిపాలెంలో పంచాయతీ భవనం నిర్మాణం దాదాపు పూర్తయిందని, చిన్నచిన్న పనులు చేయాల్సి ఉందని, వాటిని పూర్తి చేసి భవనం ప్రారంభించాలని అరిగిపాలెం ఎంపీటీసీ టి.వి.రమణ అధికారులను కోరారు. సర్వసభ్య సమావేశానికి ఆర్‌అండ్‌బీ, అటవీశాఖ అధికారులు గైర్హాజరయ్యారు.ఐసీడీఎస్ నుంచి సమావేశానికి వియ్యంపేట పీఓకు బదులు సూపర్‌వైజర్లు హాజరు కావడంపై ఎంపీడీఓ నిశ్చల ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఐసీడీఎస్ పీడీకి నివేదిస్తామని ఎంపీడీఓ తెలిపారు. జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, దాయిరి ముత్యాలమ్మ, తహసీల్దార్ సత్యం, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ దేవి, తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథుడి నూతన రథం సిద్ధం



నూతన రథం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, దాతలు

విజయనగరం టౌన్: దాసన్నపేటలో కొలువైన శ్రీజగన్నాథస్వామి రథం పాతబడి మూలకు చేరిపోవడంతో దాని స్థానంలో దేవాదాయశాఖ దాతల సహకారంతో రూ.13 లక్షల వ్యయంతో నూతన రథాన్ని నిర్మించింది. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో ఆదివారం స్వామివారికి, నూతన రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద నిలిపిన రథాలకు పుణ్యాహవచనం, పూజలు, శాంతిహోమం చేశారు. అనంతరం రథ చక్రాలకు సంప్రోక్షణలు చేసి కొబ్బరికాయ కొట్టి, మంగళహారతులు ఇచ్చారు. ఈ ఏడాది నూతన రథాలపై స్వామివారు దర్శనమిస్తారని తెలియడంతో భక్తులు వాటిని తిలకించేందుకు తరలివచ్చి, హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రామకృష్ణమాచార్యులు, సూపర్‌వైజర్ ఏడుకొండలు, సిబ్బంది, దాతలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

విజయనగరం రూరల్: మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో 6,048 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని, వారందరికీ పింఛన్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఎంపీడీఓ గంటా వెంకటరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.4 వేలతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయి మొత్తం కలిపి రూ.7 వేలు చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు రూ.3,97,75,000లు నిధులు విడుదలైనట్లు చెప్పారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందజేస్తారన్నారు. లబ్ధిదారులు అందుబాటులో ఉండాలని కోరారు.

తోటపల్లి కాలువపై వంతెన నిర్మించాలి

- అలకనారాయణపురం రైతులు విజ్ఞప్తి



అలకనారాయణపురం గ్రామం వద్ద తోటపల్లి కాలువపై వంతెన నిర్మించాల్సిన ప్రాంతం ఇదే

చీపురుపల్లి: తోటపల్లి కాలువ వచ్చిందని సంబరపడాలో లేక కాలువలపై నుంచి పంట పొలాలకు వెళ్లేందుకు వంతెనలు లేవని చింతించాలో తెలియని పరిస్థితు ల్లో రైతులు ఉన్నారు. మండలంలోని అలకనారాయణపురం గ్రామంలో ఈ పరిస్థితి నెలకొంది. పి.కె.పాలవలస పంచాయతీ పరిధిలోని అలకనారాయణపురం గ్రామం పక్క నుంచే రణస్థలం వైపు తోటపల్లి బ్రాంచ్ కెనాల్ వెళ తోంది. చీపురుపల్లి సమీపంలో ఉన్న తోటపల్లి కుడి ప్రధాన కాలువ నుంచి ఈ బ్రాంచ్ కెనాల్ ద్వారా రణస్థలం తదితర ప్రాంతా లకు సాగునీరు వెళ్లాల్సి ఉంది. అలకనారాయణపురం పక్కనుంచే ఈ బ్రాంచ్ కెనాల్ ఉంది. రైతులు దాన్ని దాటుకునే పంట పొలాలకు వెళ్లాలి. ఇక్కడ కాలువపై వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రణాళికలో కూడా ఉంది. అందుకు అనుగుణంగా కాలువకు రెండు వైపులా పనులు ప్రారంభించారు కానీ పూర్తి చేయలేదు. వంతెన లేకపోవడంతో అక్కడెక్కడో దూరంగా ఉన్న వంతెన వద్దకు వెళ్లి చుట్టూ తిరిగి పొలాలకు రావాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా పశలమ్మ పండగ

వేపాడ: చామలాపల్లి గ్రామంలో పశలమ్మ తల్లి పండగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఖరీఫ్ వరి సాగుకు ముందు ఈ పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామపెద్దలు తెలిపారు. గ్రామస్తులు ఊరేగింపుగా అమ్మవారి శతకం పట్టు వద్దకు వెళ్లి అమ్మవారికి పూజలు చేశారు. పంటలు సమృద్ధిగా పండేలా, పశువులు ఆరోగ్యంగా ఉండేలా చూడుతల్లి అని అమ్మవారిని వేడుకుంటూ పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులకు పుస్తకాలు, స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

విజయనగరం: ప్రతిభావంతులకు చేయూతనందిస్తే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ఎస్ఎస్‌వీఆర్‌ఎం రాజు అన్నారు. విశ్వ కళా పరిషత్, వనితా వాకర్స్ క్లబ్ ఫోర్ట్ శాఖ, నా ఊరు విజయనగరం, గురజాడ బ్రాహ్మణ సమాఖ్య, తిలక్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని సుమారు వంద మంది విద్యార్థులకు నోట్స్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. పట్టణంలోని యూత్ హాస్టల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన న్యాయవాది రాజు మాట్లాడుతూ.. పిల్లలకు నైతిక విలువలతో కూడిన విద్యాబోధన అందించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా సామాజిక సేవకులు, పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తిని సత్కరించారు. విశ్వ కళా పరిషత్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతలపూడి త్రినాథరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముళ్లపూడి సుభద్ర దేవి, కందాళ సాయిబాబా, టి.మహేశ్వరరావు, రామకృష్ణ, కొత్తలి ఎర్రినాయుడు, బెల్లాపు సత్యనారాయణ, ఎస్.అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

- ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



ఎమ్మెల్యే అదితి గజపతిరాజును సత్కరిస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు

విజయనగరం రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేద్దామని విజయనగరం ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అధ్యక్షతన ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో అభివృద్ధి ప్రణాళికలు, ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను విన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీపై లేవనెత్తిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిద్దామన్నారు. అనంతరం ఎమ్మెల్యేగా ఎన్నికై తొలిసారిగా మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన అదితి గజపతిరాజును మహిళా ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కర్రోతు నారాయణ, కొసర నిర్మల, ఎంపీడీవో గంటా వెంకటరావు, మండల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

14న ఘంటసాల పాటల పోటీలు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ శరత్‌చంద్ర

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రాకు సంబంధించిన గ్లోబల్ ప్రాజెక్ట్ ద్వారా జిల్లా కళాకారులకు ప్రోత్సాహకంగా ఘంటసాల పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు డాక్టర్ శరత్ చంద్ర తెలిపారు. పట్టణంలోని చాసో భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక గురజాడ స్మారక గ్రంథాలయంలో జూలై 14న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోటీలు ఉంటాయన్నారు. తొమ్మిదేళ్ల నుంచి 84 ఏళ్ల వయసు వరకు స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చన్నారు. ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఘంటసాల పాటలు, పద్యాలు, యుగళ గీతాలు, ప్రైవేటు గీతాలు, భగవద్గీత, ప్రైవేటు పద్యాలు, ఘంటసాల సంగీత దర్శకత్వంలో వెలువడిన పాటలు కూడా పాడవచ్చన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ వెంట తీసుకుని రావాలని కోరారు. ముగ్గురు న్యాయనిర్ణేతలు విజేతలను ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులతో 'పాడుతా తీయగా, స్వరాభిషేకం' వంటి బృహత్తర కార్యక్రమాలతో సాటిగా కేవలం ఘంటసాల గీతాలాపన కార్యక్రమం 20 ఎపిసోడ్స్ విడుదల చేస్తామన్నారు. వివరాలకు 9490663502, 8520033400 సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ధవళ సర్వేశ్వరరావు, మంతపూడి ప్రసాదరావు, ఆదయ్య మాస్టారు పాల్గొన్నారు.

అలరించిన సాహితీ సదస్సు



రమణను సత్కరిస్తున్న విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన 'యక్ష ప్రశ్నలు' ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. సభాధ్యక్షులుగా మహారాజా కళాశాల విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ ఎ.రాఘవరావు వ్యవహరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కస్పా హైస్కూల్ ఆంధ్రోపాధ్యాయులు రమణ పాల్గొని 'ధర్మదేవత-ధర్మరాజు ప్రశ్నోత్తరాలు' అంశంపై ప్రసంగించారు. ధర్మదేవత అడిగిన ప్రశ్నలు, దానికి ధర్మరాజు చెప్పిన సమాధానాలు ఉటంకిస్తూ సృష్టికి మూలమైన సూర్యుని గురించి, అదేవిధంగా యజ్ఞయాగాదుల విశిష్టతను వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఆ ప్రశ్నోత్తరాల ఆధారంగా మానవ సంబంధాలను, మనస్తత్వాలపై సోదాహరణంగా ప్రసంగించి ఆహూతుల మన్ననలు పొందారు. అనంతరం ముఖ్య అతిథి రమణను విజయభావన సహాయ కార్యదర్శి డాక్టర్ శ్రీభాష్యం హరిచందన్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ జక్కు రామకృష్ణ, దశగ్రంథాల వెంకట ప్రసాద్, మురళీప్రసాద్, సమాఖ్య ప్రతినిధులు బాబూజీ, భోగరాజు సూర్యలక్ష్మి, దామరాజు శంకరం, సోమేశ్వరరావు, వీవీ మూర్తి, కాపుగంటి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

చేనేత హస్త కళా ప్రదర్శనకు ఆదరణ



హస్త కళా ప్రదర్శనలో ఉంచిన వస్త్రాలు

విజయనగరం: చేనేత హస్త కళా కార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న మెసానిక్ టెంపుల్‌లో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శనకు ఆదరణ లభిస్తుంది. చేనేత, హస్తకళలు భారతదేశ ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలు. అన్ని రకాల వస్తువులు ఒకే చోట ఏర్పాటు చేయడంతో నగర వాసులు ప్రదర్శనకు పోటెత్తుతున్నారు. శ్రీసాయి దుర్గ హ్యాండ్లూమ్ హ్యాండీ క్రాఫ్ట్స్ సంఘం నిర్వాహకుడు హరీష్ మాట్లాడుతూ.. ప్రదర్శనలో పోచంపల్లి, నారాయణపేట, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారి, ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్ ప్రింటెడ్, బెంగాల్ సిల్క్, కాంతావర్క్ కాటన్, భాగల్పూర్ సిల్క్, గుజరాత్ డిజైన్ టాప్స్ అందుబాటులో ఉంచామన్నారు. జులై 16 వరకు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. విజయనగరం వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

• సేవలే గుర్తింపునిస్తాయి



ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందిని సత్కరిస్తున్న ఇన్‌చార్జ్ అడిషినల్ కమాండెంట్ పద్మనాభరాజు, తదితరులు

డెంకాడ: చింతలవలస వద్ద ఉన్న ఏపీఎస్‌పీ 5వ బెటాలియన్‌లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన వారి సేవలు మరువలేనివని బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ ఎస్సైలు ఎన్.రాధాకృష్ణ, ఎం.వేణుగోపాల్, డి.ధర్మనాథ్, కుక్ కె.అప్పారావు దంపతులను బెటాలియన్‌లోని యూనియన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో వారు అందించిన సేవలను గుర్తుచేసుకుని కొనియాడారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

శృంగవరపుకోట: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం వేలం వేయనున్నట్లు ఎస్.కోట టౌన్ సీఐ మురళీరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపా రు. ఐదు బైక్‌లను జిల్లా ఎంవీ ఇన్‌స్పెక్టర్ నిర్ణయించిన ధర మేరకు వేలం వేస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద వేలం పాట ప్రారంభమవుతుందని, ఔత్సాహికులు పాల్గొనవచ్చని తెలిపారు.

ఏపీజీఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ

చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) చీపురుపల్లి తాలూకా స్థాయి నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. పట్టణంలో శనివారం రాత్రి పూర్వ అధ్యక్షుడు కర్రోతు విశ్వేశ్వరరావు అధ్యక్షతన, ఆసంఘం జాల్లా జాయింట్ సెక్రటరీ గిడిజాల లక్ష్మనాయుడు నేతృత్వంలో ఎన్నిక నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా పిన్నింటి హరి, కార్యదర్శిగా చిప్పాడ ప్రసాదరావు, సహాధ్యక్షుడిగా పట్నాల అయ్యప్ప, కోశాధికారిగా కె.రాము, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఏ.కృష్ణకాంత్ ఎన్నికయ్యారు. సంఘం ఉపాధ్యక్షులుగా పి.రమణ, జి.వెంకటమ్మ, సీహెచ్. రామకృష్ణ, జి.వి.రమణ, సంయుక్త కార్యదర్శులుగా ఎల్.పైడితల్లి నాయుడు, రఘునందన్ నాయుడు, వరప్రసాద్, బి.చంద్రరావు, అజాహరుద్దీన్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కంది వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాలూకా స్థాయిలో ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా జిల్లాలో ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. జిల్లా స్థాయిలో తనతో పాటు జిల్లా కార్యదర్శి బాల భాస్కరరావు నిరంతరం అందుబాటులో ఉంటామని తెలిపారు. ఎన్నికల పర్యవేక్షకురాలు పి.మేరీ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో యోగా భాగం కావాలి



యువకులకు యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న సుజాత

చీపురుపల్లి: యువత జీవితంలో యోగా ఒక భాగం కావాలని అప్పుడే ఆరోగ్యకర సమాజం నిర్మితమవుతుందని శ్రీచైతన్య యోగా కేంద్రం శిక్షకురాలు గవిడి సుజాత చెప్పారు.స్థానిక జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న యువతకు ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగాపై ఆదివారం అవగాహన కల్పించారు. యోగా శిక్షకురాలు సుజాత మాట్లాడుతూ యువత వ్యాయామంతో పాటు యోగా కూడా చేయాలన్నారు. ప్రస్తుత ఒత్తిడి ప్రపంచంలో యోగా ఎంతో అవసరమని చెప్పారు. ఆహారపు అలవాట్లు మారిపోయిన నేపథ్యంలో చాలా మందికి దీర్ఘకాలిక వ్యాధులు సైతం వస్తున్న సందర్భాలు ఉన్నాయన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు దూరమవ్వాలన్నా, ఏకాగ్రత పెరగాలన్నా యోగా అవసరమని, రోజూ యోగా చేయాలని సూచించారు. అనంతరం యువకులతో యోగాసనాలు వేయించారు. ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ పాల్గొన్నారు.